## విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189



# మనవార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి:1, సంచిక:123 | volume: 1, Issue:123 | సోమవారం 01 డిసెంబర్ 2025 పేజీలు : 8 వెల : 3.00


## నవంబర్ భారత గర్వాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లిన నెల ప్రధాని మోదీ



**న్యూ ఢిల్లీ** ప్రధాని నరేంద్ర మోదీ "నవంబర్ నెల దేశానికి అసాధారణ గర్వాన్నిచ్చిన నెల" అని పేర్కొన్నారు. మాన్ కీ బాత్ ద్వారా ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, అయోధ్యలో నిర్వహించిన ధర్మ ధ్వజారోహణ ఉత్సవం, భగవాన్ బిర్సా ముండా జన్మ శతాబ్ది వేడుకలు, వందే మాతరం 150 ఏళ్ల సంబరాలు దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కొత్త తరాలకు మరింత చేరవేశాయని అభిప్రాయపడ్డారు. "ఈ నెలలో భారత ఆత్మ, భారత సంప్రదాయం, భారత గర్వం అన్నీ ఒకే దారిలో నడిచాయి" అని మోదీ అన్నారు. రాష్ట్ర రక్షణ సామర్థ్యాలలో భారత్ సాధించిన పురోగతి నవంబర్ నెలలో స్పష్టంగా కనిపించిందని ప్రధాని గుర్తుచేశారు. ప్రపంచ స్థాయి దోరణి పరిరక్షణ కేంద్రంగా భారత్ ఎదుగుతున్నట్టు పేర్కొంటూ, సముద్ర రక్షణలో కొత్త అధ్యాయం రాసిన ఐఎన్ఎస్ మహే ప్రవేశపెట్టడంపై గర్వం వ్యక్తం చేశారు. దేశ రక్షణలో స్వయంసంపూర్ణతను బలోపేతం చేయడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, "స్వదేశీ శక్తితో నిర్మించిన ప్రతి యంత్రం, ప్రతి నౌక దేశ భవిష్యత్తు వైపు శక్తివంతమైన అడుగు" అని మోదీ స్పష్టం చేశారు. అంతరిక్ష రంగంలో భారత యువత చూపుతున్న ప్రతిభను ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్వదేశీ రాకెట్ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్న స్కైరూట్ ఏరోస్పేస్ "అనంత కేంద్రం" ప్రారంభోత్సవాన్ని ఆయన అత్యంత ముఖ్య ఘట్టంగా అభివర్ణించారు. భారత శాస్త్రవేత్తలు, యువ ఇంజినీర్లు, పరిశోధకుల ధైర్యం అంతరిక్షంలో భారత్‌ను అత్యున్నత స్థానంలో నిలబెడుతుందని మోదీ గారు తెలిపారు. "భారత అంతరిక్ష కలలను సాధించే యువతే దేశానికి కొత్త శక్తి" అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో కూడా దేశం చరిత్రాత్మక రికార్డు నమోదు చేసిందని ప్రధాని తెలిపారు. ఆహార ఉత్పత్తిలో భారత్ కొత్త శిఖరాలను అధిరోహించిందని ఆయన రైతులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "రైతు చెమటే దేశ ఆహార భద్రతకు పునాది" అని ప్రశంసిస్తూ, వారి కృషి వల్లే భారత్ ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార ఉత్పత్తి దేశాల్లో ఒకటిగా నిలిచిందని అన్నారు. నవంబర్ నెలలో భారత సంస్కృతి, రక్షణ, అంతరిక్ష, వ్యవసాయ రంగాలలో నమోదైన ఘట్టాలు దేశాన్ని మరింత ముందుకు నడిపే శక్తిగా నిలుస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

## సిరిసిల్లలో కాంగ్రెస్ కొత్త పటిమకు శ్రీకారం
## నాయకులకు ధైర్యం, కార్యకర్తలకు ఉత్సాహం



**-అమరవీరులకు నివాళులు భారీ ర్యాలీతో శక్తిప్రదర్శన...**

**సిరిసిల్ల** రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు కొత్త ఊపు వచ్చేసింది. జిల్లాలో నిర్వహించిన కీలక కార్యక్రమాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా హాజరై నాయకులకు ధైర్యం, కార్యకర్తలకు ఉత్సాహం నింపారు. పార్టీ కొత్త జిల్లా అధ్యక్షుడిగా సంగీతం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన సందర్భం పట్టణంలో వేడుకలా మారింది. ఉదయం బస్ స్టాండ్ వద్ద జరిగిన ప్రారంభ వేడుకలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర నేతలతో కలిసి అమరవీరుల స్థూపానికి పూలమాలలు అర్పించి గౌరవ నివాళులు అర్పించారు. అనంతరం బస్ స్టేషన్ నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించబడింది. పొన్నం ప్రభాకర్ వెంట నడుస్తూ కార్యకర్తలు నినాదాలతో ఉత్సాహపూరిత వాతావరణాన్ని సృష్టించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యక్రమంలో సంగీతం శ్రీనివాస్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా పర్యవేక్షించారు. కొత్త అధ్యక్షుడిని సత్కరించి, జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీనియర్ నేత వి. హెచ్, మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప తదితర నేతలు పాల్గొన్నారు. కొత్త నేతృత్వం, మంత్రిత్వ సహకారం, కార్యకర్తల ఉత్సాహం మూడింటి కలయికతో కాంగ్రెస్ మరోసారి సిరిసిల్లలో పటిష్ట అడ్డాగా నిలుస్తుందనే సంకేతాలు ఈ కార్యక్రమం వెలువరించింది.

## తిరుపత్తూరులో ఘోర బస్సు ప్రమాదం

**తిరుపత్తూరు,** తమిళనాడులోని తిరుపత్తూరు జిల్లాలో ఆదివారం సాయంత్రం జరిగిన భయానక రోడ్డు ప్రమాదంలో 11 మంది ప్రయాణికులు మృతి చెందగా, 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. కరైకుడి వైపు వెళు



న్న ప్రభుత్వ బస్సు, మదురై వైపు వెళ్తున్న మరో ప్రభుత్వ బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన ప్రాంతాన్ని ఒక్కసారిగా విషాదంలో ముంచింది. ఢీకొన్న బస్సుల్లో ప్రయాణికులు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థ ప్రమాదంలో 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన 40 మందిని వెంటనే శివగంగై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సుల వేగం, రోడ్డు పరిస్థితులు, డ్రైవర్ నిర్లక్ష్యం వంటి అంశాలపై పరిశీలన చేస్తున్నారు. రెండు ప్రభుత్వ బస్సుల ఢీకొట్టడం వల్ల భారీ ప్రాణనష్టం సంభవించడంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. రోడ్డు భద్రతపై మరింత చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

## కోల్‌కతాలో మహిళపై దారుణం



**కోల్‌కతా** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఒక మహిళపై ముగ్గురు వ్యక్తులు దారుణంగా వ్యవహరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నవంబర్ 28 రాత్రి ప్రగతి మైదాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్టాండ్ వద్ద యాప్ క్యాబ్ కోసం వేచిచూస్తున్న మహిళను బలవంతంగా కారులోకి లాగి, మద్యం తాగించేందుకు ఒత్తిడి చేసి, అనంతరం లైంగిక దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. సంఘటన అనంతరం ఆమెను అదే ప్రాంతంలో వదిలివేసి నిందితులు పారిపోయారు. పోలీస్ ప్రాథమిక నివేదిక ప్రకారం బాధితురాలికి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరితో మూడు నెలలుగా పరిచయం ఉన్నట్లు తెలిసింది. కారులోకి లాగిన తర్వాత మత్తు మందు కలిపిన మద్యం ఇచ్చి ఆమెను బలహీన స్థితిలోకి నెట్టారని విచారణలో తెలిసింది. ఘటన ప్రాంతంలో ఉన్న స్థానికులు మహిళ పరిస్థితిని గమనించి వెంటనే ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విచారణ ప్రారంభమైంది. పోలీసులు ఆసుపత్రిలో ఉన్న బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. కేసు నమోదు చేసి, సంఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ సర్వైలెన్స్ ఆధారంగా నిందితుల కదలికలను అనుసరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాధితురాలి వైద్య పరీక్షలు పూర్తయ్యాయని, ఆమె చికిత్సలో ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మహిళల భద్రతకు విఘాతం కలిగించే ఘటనగా దీన్ని పోలీసులు అత్యంత గంభీరంగా తీసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దింపబడ్డాయి. బాధితురాలికి సముచిత న్యాయం చేయడమే తమ లక్ష్యమని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళల భద్రతను మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనపై కవిత విమర్శలు ప్రభుత్వ సొమ్ముతో ప్రచారం జరుగుతోందా?

**– ముఖ్యమంత్రి పర్యటనను నిలిపివేయాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి...**

**హైదరాబాద్, నవంబర్ 30 :**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వం ఎన్నికల నియమాలను పక్కన పెట్టి ప్రభుత్వ సొమ్ముతో రాజకీయ ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు. గ్రామాల్లో ఎన్నికలు జరుగుతుంటే, పట్టణాలు జిల్లా కేంద్రాల్లో ముఖ్యమంత్రి అభివృద్ధి



కార్యక్రమాలు చేపట్టడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. గ్రామస్థులను ప్రభుత్వ వాహనాలతో పట్టణాలకు తరలించి సభలకు సమీకరించడం ఎన్నికల కోడ్‌ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని కవిత ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాధనంతో ఎన్నికల ప్రభావాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె విమర్శించారు. ఎన్నికలు గ్రామాల్లో జరుగుతుంటే, పట్టణ కేంద్రాల్లో శంకుస్థాపనలు పెట్టడం వెనుక ఉద్దేశ్యం ప్రజలను పెద్ద ఎత్తున రప్పించి రాజకీయ సందేశం ఇవ్వడమేనని కవిత ఆరోపించారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న పర్యటనల్లో ప్రభుత్వ వనరులను వినియోగించడం న్యాయసంగతం కాదని, సర్పంచ్ ఎన్నికల మధ్యలో ఇలాంటి కార్యక్రమాలు జరుగడం ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపుతుందని ఆమె వివరించారు. ప్రభుత్వ విధానాలు ప్రజల డబ్బుతో ప్రజలను ఆకర్షించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణం జోక్యం చేసుకుని ముఖ్యమంత్రి పర్యటనను నిలిపివేయాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల సమయంలో ప్రజాధనంతో నిర్వహించే సభలు, ర్యాలీలు, భారీ శంకుస్థాపనలు అనుమతించరాదని ఆమె గుర్తు చేశారు. గ్రామాల నుండి ప్రజలను తరలించి పట్టణాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఎన్నికలపై ప్రభావం చూపే చర్యగా పరిగణించాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. సర్పంచ్ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే ప్రభుత్వం కూడా అదే బాధ్యతతో వ్యవహరించాలని ఆమె సూచించారు. ప్రభుత్వం ఎన్నికల నియమాలను పాటించాలనే భావనతో మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన కర్తవ్యంతో కూడిన నిర్ణయాలు తీసుకోవాలని కవిత స్పష్టంచేశారు. అభివృద్ధి కార్యక్రమాలు అవసరమే అయినా, ఎన్నికల సమయాల్లో వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం ప్రజలకు తప్పుదోవ చూపడమేనని ఆమె అన్నారు. ఇదే విషయంపై విస్తృతంగా ఫిర్యాదులు వస్తుండటంతో రాష్ట్ర ఎన్నికల సంఘం దీనిపై స్పందించాలని నేతలు కూడా కోరుతున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలు కొనసాగుతాయా? లేక ఎన్నికల సంఘంకొత్త మార్గదర్శకాలు జారీ చేస్తుందా? అన్నదానిపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

## తుక్కుగూడలో బీజేపీ రాష్ట్రస్థాయి కార్యశాల



**తుక్కుగూడ** తెలంగాణలో పార్టీ కార్యకలాపాలను పటిష్టం చేయడానికి భారతీయ జనతా పార్టీ నిర్వహించిన 'ప్రదేశ్ సంఘటనాత్మక కార్యశాల' తుక్కుగూడలో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి కీలక నేతల సమక్షంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించబడింది. ప్రారంభ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా రాంచందర్ రావు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీని గ్రామ, బూత్ స్థాయిల వరకు విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. అదే సమయంలో పార్టీ ఆదర్శాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యశాలలో జాతీయ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) బి.ఎల్. సంతోష్, తెలంగాణ ఇన్‌ఛార్జ్ జాతీయ జాయింట్ ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ తదితరులు పార్టీ బలోపేతంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. తెలంగాణలో బీజేపీ వ్యూహాత్మకంగా మరింత శక్తివంతం కావాలంటే బూత్ స్థాయిలో నిర్వహణ, కార్యకర్తల శిక్షణ, ఓటర్ల చేరువ ముఖ్యమని వారు సూచించారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన కీలక చర్యలపై విపులంగా చర్చించారు. జాతీయ నాయకులు అభయ్ పటిల్, జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ సమ్బిత్ పత్ర, మహబూబ్‌నగర్ ఎంపీ దిక్విజయ అరుణ తదితర సీనియర్ నేతలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీలో అంతర్ వ్యవస్థను బలోపేతం చేయడం, రాష్ట్ర స్థాయిలో నాయకత్వాన్ని బలపరచడం, కార్యకర్తలను మరింత చురుకుగా మార్చడం వంటి అంశాలు ఈ కార్యశాల యొక్క కేంద్రబిందువుగా నిలిచాయి. మొత్తం మీద బీజేపీ తెలంగాణలో తన పునర్వ్యవస్థీకరణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్టు ఈ సమావేశం స్పష్టంచేసింది.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**-సేవా ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ గౌడ్...**

**గజ్వేల్ నవంబర్ 30 మన వార్త ప్రతినిధి** ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి మందు, డబ్బుకు ఆశపడి ఓటును అమ్ముకోవద్దు అని సేవా ఫౌండేషన్ చైర్మన్ సామాజిక కార్యకర్త తాండ బాలకృష్ణ గౌడ్ అన్నారు ఆదివారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలో తండా బాలకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఓటును అమ్ముకొని ప్రజాసామ్యాన్ని అభాసుపాలు చేయొద్దని కోరారు ఓటు హక్కును స్వచ్ఛందంగా సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ప్రజలు మందు, డబ్బుకు ఆశపడి ఓటును అమ్ముకోవద్దని సూచించారు, ప్రభుత్వం నోటా సౌకర్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచింద ని, పోటీదారులెవరూ నచ్చకుంటే నోటాను వినియోగించుకోవాలని సూచించారు, ఓట్ నాట్ ఫర్ సెల్ అని అన్నారు, యువత బీరు బిర్యాని అని విలువైన జీవితాలు ఆగం చేసుకోవద్దని,గ్రామం ఎవరితో అభివృద్ధి చెందుతుందో విజ్ఞతతో చూసి వారికి ఓటు వేసుకోవాలని సూచించారు..



# జాలిగామ గ్రామంలో పోలీస్ కవాతు

**-గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరుపుకోవాలని ఎసిపి నర్సింలు...**



**గజ్వేల్ నవంబర్ 30 మన వార్త ప్రతినిధి** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో గజ్వేల్ పోలీసు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గజ్వేల్ ఏసిపి నర్సింలు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, సమస్మాత్మక పోలింగ్ కేంద్రాలలో గట్టి నిఘ ఏర్పాటు చేయడం జరిగిందని,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు, జాలిగామ గ్రామంలో ప్రధాన కూడల్లో, ప్రత్యేక బలగాల సిబ్బందితో గజ్వేల్ పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సి ఐ లు రవికుమార్, ముత్యం రాజు, ఎస్ఐలు ప్రేమ్ దీప్, మల్లారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం : నంగునూరి సత్యనారాయణ

**గజ్వేల్ నవంబర్ 30 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఆర్యవైశ్య సీనియర్ నాయకుడు గుడాల శ్రీహరి అకాల మరణం చెందారు విషయం తెలుసుకున్న కొమరవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో, గజ్వేల్ ఐ క్లినిక్ డాక్టర్ల పర్యవేక్షణ లో కార్తీ శేషులు గుడాల శ్రీహరి నేత్రాలు సేకరించారు ఈ సందర్భంగా నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ నేత్రదానం మహాదానమని, చనిపోయిన వారి నేత్రాలను దానం చేయడం మహా పుణ్యమని ఒకరి నేత్రాలు మరో నలుగురికి చూపును ఇస్తాయని నేత్రదానం, అవయవదానంపై ప్రజల్లో అవగాహన రావాలని అన్నారు, ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్స్, సహనాజ్ సమీర్, అత్తెల్లి శ్రీనివాస్,లయన్ దొంతుల సత్యనారాయణ,బొమ్మ రమణ, గుడాల ఓంకార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు




# మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

**గజ్వేల్ నవంబర్ 30 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆర్యవైశ్య సీనియర్ నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త గుడాల శ్రీహరి అకాల మరణం చెందారు విషయం తెలుసుకున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆదివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు, మృతుని నేత్రాలను లయన్స్ క్లబ్ వారు సేకరించడానికి సహకరించిన కుటుంబ సభ్యులను అభినందించారు,వారితో పాటు స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ సహనాజ్ సమీర్, కొమరవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ, సబ్బని నరేష్, ఆర్యవైశ్య నాయకులు, గుడాల ఓంకార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు




# ప్రజావాణి కార్యక్రమం రద్దు



**-ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ 30** రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోహా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ 30** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ ఆదివారం పరిశీలించారు. బోయినపల్లి మండలంలోని కొదురుపాక, బోయినపల్లి, కోరెం, స్తంభంపల్లి లోని ఆర్ఓ కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిద్ధంగా ఉంచిన నామినేషన్ పత్రాలు, హెల్ప్ డెస్క్ పరిశీలించి, సూచనలు చేశారు.

## అల్వాల్‌లో పలు కాలనీల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే, మల్కాజిగిరి ఇంచార్జి మైనంపల్లి హనుమంత్‌రావు..

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 30 మన వార్త :**మల్కాజిగిరి నియోజకవర్గంలోని బొల్లారం 133 డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే మల్కాజిగిరి ఇంచార్జి మైనంపల్లి హనుమంత్ రావు పలు కాలనీల్లో పర్యటన చేశారు.కార్పొరేటర్నాథ్ జితేందర్ నాథ్ తో కలిసి లక్ష్మి ఎంక్లేవ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పైప్‌లైన్ పనులకు మైనంపల్లి హనుమంత్ రావు శంఖుస్థాపన చేశారు. కాలనీ వాసులు స్వయంగా అభివృద్ధి పనుల కోసం నిధులు సమీకరించుకోవడం ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిహెచ్ఎంసి పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని హనుమంత్ రావు తెలిపారు. ప్రజల సహకారం ఉంటే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మూల రాజేష్ కుమార్, కోశాధికారి నరసింహా చారి, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 'కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం'


**-షార్ట్ సర్క్యూట్ తో ఎగిసిన నిప్పురవ్వలు...**
**-30 బొమ్మల దుకాణాలు పూర్తిగా దగ్ధం...**
**-రూ. కోటిపైగానే ఆస్తినష్టం...**



**మల్యాల, నవంబర్ 30 (మన వార్త ప్రతినిధి)**జగిత్యాల- కరీంనగర్ ప్రధాన రహదారిలోని కొండగట్టు దిగువన ఉన్న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాంతంలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి సుమారు 30కి పైగా బొమ్మల దుకాణాలు దగ్ధమయ్యాయి. కాగా, మంటలు ఒక్కసారిగా ఎగిసిపడడంతో దుకాణాల నుంచి జనాలు బయటకు పరుగులు పెట్టారు. దీంతో బొమ్మలు అమ్ముకుని జీవనం సాగించే కొన్ని కుటుంబాలకు కట్టుబట్టలే మిగిలాయి. దుకాణ సామాగ్రితోపాటు, నగదు, బంగారం, ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. కాగా, అగ్నిప్రమాద దృశ్యాలు సంఘటనా జరిగిన తీవ్రతను తెలియజేస్తున్నాయి. సుమారు కోటికి పైగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. షార్ట్ సర్క్యూట్ తోనే ప్రమాదం సంభవించగా, దుకాణాలు వెదురు బొంగులతో తయారుచేయడంతో పాటు, అందులో పూర్తిగా ప్లాస్టిక్కు చెందిన వస్తువులు ఉండడంతోనే ప్రమాద తీవ్రత పెరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. అలాగే, ఫైర్ ఇంజన్ సకాలంలో స్పందించకపోవడం వల్లనే భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ ఇంజన్ త్వరగా వచ్చి మంటలు ఆర్పి ఉంటే ఇంత ఘోరమైన ప్రమాదం జరిగి ఉండేది కాదని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. కాగా, ప్రమాద స్థలాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ. 20వేల నగదును అందించారు. అలాగే బాధిత కుటుంబానికి మహిళా సంఘాల ద్వారా 5 లక్షల వడ్డీ లేని రుణాలను అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తన వంతుగా ఒక్కో కుటుంబానికి 5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

# ఎస్ ఈ సీ నిబంధనలు పాటించాలి

**-అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్...**
**-మీడియా సంస్థల అడ్వర్టైజ్మెంట్, పలు ప్రింటింగ్, ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రతినిధులతో సమావేశం...**



**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 30,మన వార్త** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన అడ్వర్టైజ్మెంట్, కరపత్రాలు, ఫ్లెక్సీలు ఇతర ముద్రణలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ ఈ సీ) నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ)గడ్డం నగేష్ సూచించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలు మీడియా సంస్థల అడ్వర్టైజ్మెంట్ ప్రతినిధులు, ప్రింటింగ్, ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులు, బాధ్యులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆదివారం అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచారానికి సంబంధించి అడ్వర్టైజ్మెంట్, కరపత్రాలు, ఫ్లెక్సీలు ప్రింట్ చేసేందుకు వారి బ్యాంక్ ఖాతా నుంచే డబ్బులు చెల్లించాలని తెలిపారు. అడ్వర్టైజ్మెంట్, కరపత్రాలు, ఫ్లెక్సీలు ప్రింట్ లపై ప్రత్యేక కమిటీ పర్యవేక్షించి, పోటీలో ఉన్న అభ్యర్థుల వ్యయంలో జమచేస్తారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మీడియా సంస్థలు, ప్రింటింగ్, ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గీతా జయంతి ఉత్సవాలకు ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం

**పెబ్బేరు.నవంబర్ 30(మన వార్త ప్రతినిధి)** పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలోనీ శ్రీశ్రీ శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం ముస్తాబయింది.గీతా జయంతి ఉత్సవాలను శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ భూమి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.గీతా జయంతి సందర్భంగా సోమవారం ఆలయాలంలో ఉదయం 6 గంటలకు నుండి వేణుగోపాలస్వామి వారికి అభిషేకాలు మరియు పూజా కార్యక్రమాలు.7 గంటల గీతా పారాయణం. పట్టణంలోని 8 గంటలకు బ్రహ్మంగారి ఆలయం నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు వేణుగోపాలస్వామి, నారాయణస్వామి ప్రతిమలతో భాజా భజంత్రీలతో భజనలు చేస్తు ఊరేగింపు కార్యక్రమం జరుగును. ఉదయం 10 గంటలకు ఆలయంలో హెూమం.12 గంటలకు ప్రముఖులచే ప్రవచనాలు స్వామివారి దర్శనాలు ఉండును అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం మహిళా బృందాలచే కోలాట కార్యక్రమాలు అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వేణుగోపాలస్వామి కృపకు పాత్రులు కావాలని కమిటి సభ్యులు కోరారు.



## శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతిష్ఠాత్మక సన్మానం

**భద్రాచలం, నవంబర్ 30.( మన వార్త ప్రతినిధి).**రక్తసేవకు అంకితభావంతో ఉన్న షాజ్ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ సింధా కు ప్రేరణాత్మక పురస్కారంశారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని బిర్లా ప్లానెటోరియంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో, రక్తదానం ద్వారా అనేక మందికి ప్రాణదాయక సహాయం అందిస్తూ సమాజ సేవలో ముందంజలో నిలుస్తున్న భద్రాచలం నకు చెందిన షాజ్ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ సింధాకు ప్రేరణాత్మక పురస్కారం అందజేశారు. శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆరోగ్యం, విద్య, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక రంగంలో పలువురిని గౌరవిస్తూ వస్తున్న సంస్థగా గుర్తింపు పొందింది. కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంఎల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బండారు దత్తాత్రేయ వివిధ ప్రజా బాధ్యతల్లో పనిచేసిన నాయకుడిగా సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తూ వస్తున్నట్లు రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, రక్తదానాన్ని ఓ మహోన్నత సేవగా భావించి యువత ముందుకు రావాలని, షాజ్ బ్లడ్ ఆర్గనైజేషన్ లాంటి సంస్థలు రక్తదాన సంస్కృతికి నూతన ఊపిరి ఇస్తున్నాయని అభినందించారు. ఈ సందర్భంగా మహమ్మద్ సింధా మాట్లాడుతూ, "సామాజిక మాధ్యమాలు, స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో అవసరమైన సమయంలో రక్తదాతలను కలిపే వేదికగా సంస్థ పనిచేస్తోంది. రాబోయే రోజుల్లో మరిన్ని రక్తదాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా సేవా విస్తరణ దిశగా ముందుకు సాగుతామని" తెలిపారు. కార్యక్రమంలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు, షాజ్ బ్లడ్ ఆర్గనైజేషన్ వాలంటీర్లు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



## నామినేషన్ కేంద్రాలు, ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

**-జిల్లెల ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ తనిఖీ...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త నవంబర్ – 30** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాలు, చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి




గరిమ అగ్రవాల్ ఆదివారం పరిశీలించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించి, వాహనాల తనిఖీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లెల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ కేంద్రం, తంగళ్ళపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్, తంగళ్ళపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్ఓ కేంద్రాల్లో అభ్యర్థుల కోసం కల్పించిన సహాయ కేంద్రం, వసతులు పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. పరిశీలనలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

## అయ్యప్ప స్వాములకు అన్నదానం...

**పెబ్బేరు.నవంబర్30 (మన వార్త ప్రతినిధి)**పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాణిక్యాల నాగరాజు గురుస్వామి



ధర్మపత్ని మహేశ్వరి కూతురు ప్రసన్న లక్ష్మి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు ఈశ్వర్ గురుస్వాములు ప్రదీప్ గౌడ్, బాలవర్ధన్,వీర బొజ్జ,వెంకటేశ్వర్ రెడ్డి,శాంతన్న స్వామి,మణికంఠలు,కన్నె స్వాములు గురు స్వాములు వీరాచారి సూర్యవంశం పరుశరాముడు.పాల్గొన్నారు

## ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ

**మధిర, నవంబర్30( మన వార్త):**కాంగ్రెస్ పార్టీ అధికారంలో బీసీ రిజర్వేషన్లు పెంచుతామని హామీ




ఇచ్చి ఆ మాటను ఖాజీపురం సర్పంచ్ జనరల్ స్థానాన్ని బీసీలకు కేటాయించిన ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఖాజీపురం గ్రామ సర్పంచ్ స్థానాన్ని జనరల్ కు కేటాయించగా అట్టి స్థానంలో కాంగ్రెస్ పార్టీ బీసీ కులానికి చెందిన శ్రీమతి ఆయేషా కమాల్ తో నామినేషన్ వేయించి పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని ఎక్కడ అవకాశం ఉన్న బీసీలకు అవకాశం కల్పిస్తామని వారికి పూర్తి న్యాయం చేస్తామని రుజువు చేసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన శ్రీమతి ఆయేషా కమాల్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని, మండల అధ్యక్షుడు కిషోర్, ఇతర మండల నాయకుల అందరికీ తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి పనిచేసి గ్రామ అభివృద్ధికి పాటుపడతాయని తెలియజేశారు.

## భద్రాచలం పంచాయతీలో పోటీ హీటప్

**-భద్రాచలం పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్-కాంగ్రెస్-కూటమి పోరు..**

**-శ్వేత, మరికొందరు స్వతంత్ర బరిలో...**

**భద్రాచలం, నవంబర్ 30. ( మన వార్త ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మేజర్



గ్రామ పంచాయతీలో 20 వార్డులు, 40,761 మంది ఓటర్లతో ఓట్ల పండుగ సిద్ధం. సర్పంచ్ పదవికి 11 నామినేషన్లు, వార్డు సభ్యతలకు 98 నామినేషన్లు దాఖలై, పరిశీలనలు పూర్తయ్యాయి. ప్రధాన అభ్యర్థులు, పార్టీల కసరత్తుసర్పంచ్ స్థానానికి బీఆర్ఎస్ నుంచి మానె రామకృష్ణ, కాంగ్రెస్ మద్దతుతో పూనెం కృష్ణదొర, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నుంచి హరిశ్చంద్రనాయక్ పోటీ పడుతున్నారు. మాజీ సర్పంచ్ భూక్యా శ్వేత స్వతంత్రురాలిగా బరిలోకి ఉన్నారు. శ్రీరామ దివ్యక్షేత్రం ప్రాంతంలో పోటీ రాజకీయ కోలాహలం రేపుతోంది. ఎన్నికల నేపథ్యం, ఆలస్య కారణాలు 1962లో గ్రామ పంచాయతీగా ఏర్పడిన భద్రాచలం 2013లో మేజర్ పంచాయతీగా మారింది. 2018 తర్వాత కోర్టు కేసులు, పరిహారాలు, రాజకీయ ఆరోపణలతో ఎన్నికలు ఆలస్యం అయ్యాయి. త్రిముఖ పోటీ తీవ్రత: బీఆర్ఎస్ (మానె రామకృష్ణ), కాంగ్రెస్ మద్దతు (పూనెం కృష్ణదొర), టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి (హరిశ్చంద్రనాయక్) మధ్య పోటీ, మాజీ సర్పంచ్ భూక్యా శ్వేత స్వతంత్ర పోటీ ఓటులు విభజనకు కారణం అవుతాయి. ఎట్టకేలకు పోలింగ్ ఖరీదైన పోటీకి సిద్ధం అవుతుందని భద్రాచలం అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆశభావం ను విశ్లేషకులు స్థానికులు భావిస్తున్నారు.

## రోడ్డు విస్తరణ పనులకు ఏడు కోట్లు మంజూరి...

**-దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి...**

**చేగుంట నవంబర్ 30 ( మన వార్త ప్రతినిధి )** చేగుంట మండలం వడియారం బైపాస్ రోడ్డు నుండి



రెడ్డిపల్లి బైపాస్ వరకు 4.6 కిలోమీటర్ల దూరం నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ కోసం ఏడు కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా ఆయన చేగుంట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వడియారం నుండి రెడ్డిపల్లి బైపాస్ వరకు నాలుగు లైన్ల రోడ్డు మంజూరి నేడు కావడం జరిగిందని ఆయన తెలిపారు.

## నామినేషన్ కౌంటర్లను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ నగేష్...



**చేగుంట నవంబర్ 30( మన వార్త ప్రతినిధి )** చేగుంట మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల కౌంటర్లను మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించారు మొదటి రోజు ఆదివారం నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు ఎవరికి ఇబ్బంది లేకుండా నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి పత్రాలను తీసుకోవాలని తెలిపారు ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ల పత్రాలు ఉండాలని అన్నారు. మూడు రోజులపాటు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని నామినేషన్ పత్రాలలో ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని ఆయన అన్నారు.

## నిక్కచ్చిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు



**-సర్పంచ్ ఎన్నికలలో ప్రలోభాలకు గురి చేస్తే కేసులు తప్పవు...**

**-స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి...**

**-సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి.....**

**వేములవాడ నవంబర్ 30 (మన వార్త )**సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ను కఠినంగా అమలు చేయడంతో పాటు,ప్రలోభాలను నివారించేందుకు జిల్లా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టడం జరిగిందని సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ..సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామాల్లో అభ్యర్థులు,వారి అనుచరులు డబ్బు పంచడం,ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం,కుల సంఘాలకు డబ్బు పంచడం,గ్రామ అభివృద్ధి పేరుతో డబ్బులు అడగడం,ఆశాచూపడం వంటి చర్యలపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ప్రజలు భయభ్రాంతులు లేకుండా, స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా,శాంతియుత వాతావరణంలో జరిగేలా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు, మండలాల వారిగా ఎఫ్ ఎస్ టి బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం ఎన్నికలపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు..

## నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన మెదక్ ఆర్డీవో రమాదేవి, జెడ్పి సీఈఓ ఎల్లయ్య...

**-ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలి...**

**రామాయంపేట నవంబర్ 30( మన వార్త ప్రతినిధి)** మెదక్ జిల్లా రామాయంపేట నిజాంపేట మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల సర్పంచ్ వార్డు సభ్యుల రెండో విడత నామినేషన్ ప్రక్రియను ఆదివారం మెదక్ ఆర్డీవో రమాదేవి, జెడ్పి సీఈఓ ఎల్లయ్య లు



పరిశీలించారు. రామాయంపేట, నిజాంపేట ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని రిటర్నింగ్ ఆఫీసర్లను,అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను సంబంధిత అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం నామినేషన్లను స్వీకరించాలని అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలన్నారు. నామినేషన్ కేంద్రాలకు నామినేషన్ వేయడానికి వచ్చిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఖర్చులు లావాదేవీలు కొత్త బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి నిబంధన మేరకు ఎన్నికల ఖర్చు జరుపుకోవాలన్నారు. అలాగే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవడానికి ప్రజలు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

## స్థానిక ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు



**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి...**

**మధిర,నవంబర్ 30(మన వార్త):**స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా, ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమైనందున ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికముగా రద్దు చేయడం జరిగిందని,ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వేములవాడ అభివృద్ధి

**-పట్టణం, ఆలయం సమాంతరంగా అభివృద్ధి...**

**-సబ్బండ వర్గాల మద్దతుతో ముందుకెళ్తున్న ఆది శ్రీనివాస్...**

**- ప్రభుత్వ విప్ ఆది నేతృత్వంలో పనిచేయడం గర్వంగా ఉంది...**

**-కాంగ్రెస్ నాయకులు సయ్యద్ సాబీర్.....**

**వేములవాడ,నవంబర్ 30 ( మన వార్త ప్రతినిధి)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంతో పాటు, పట్టణాన్ని అన్ని




రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా,ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు ఉంటాయని, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సబ్బండ వర్గాల మద్దతుతో అభివృద్ధిలో దూసుకుపోతున్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు తిప్పాపూరం ఇందిరమ్మ కమిటీ సభ్యులు సయ్యద్ సాబీర్ అన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి చేస్తున్నారన్నారు,ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం నెలకొందని, ప్రతి గ్రామానికి కనెక్టివిటీ రోడ్ల నిర్మాణం, మూలవాగులపై బ్రిడ్జిల నిర్మాణం, సాగునీరు త్రాగునీరు తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో ఆది శ్రీనివాస్ ముందున్నారన్నారు, వేములవాడ పట్టణంలోని మూల వాగు పై గత ప్రభుత్వా నిర్మించిన బ్రిడ్జి రెండుసార్లు కూలిపోయిందని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టిందని త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం ఆది శ్రీనివాస్ సారథ్యంలో పూర్తవుతుందని తెలిపారు.గత ప్రభుత్వంలో పదేళ్లుగా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, ఇందిరమ్మ పాలనలో అర్హులైన ప్రతివారికి రేషన్ కార్డులు మంజూరు చేశారన్నారు.బతుకమ్మ చీరలను ఆనాడు కాల్చివేశారని, నేడు ఇందిరమ్మ చీరలను మహిళలు ఆనందంగా స్వీకరిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిన ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి చెప్పుకునే అంత గుండె ధైర్యాన్ని ఆది శ్రీనివాస్ ప్రజలకు కల్పించి, ప్రజల మనిషిగా మెలుగుతున్నారన్నారు. వేములవాడ నియోజకవర్గం అభివృద్ధి ఆది శ్రీనివాస్ తోనే సాధ్యమని పునరుద్ఘాటించారు.

## నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన జెసి నగేష్...

**చిన్న శంకరంపేట నవంబర్ 30 (మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్ వార్డు సభ్యులకు నామినేషన్లు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి, నామినేషన్ల స్వీకరణ కోసం 8 కౌంటర్లను ఏర్పాటు చేశారు, నామినేషన్ ప్రక్రియను జిల్లా అదన కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈవో ఎల్లయ్య లు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేసి అందజేయాలని, మూడు రోజులపాటు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని ఆయన తెలిపారు, ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని కులధృవీకరణ పత్రాల కోసం అభ్యర్థులు ఇబ్బందులు పడకూడదని నామినేషన్ పత్రాలపై సంబంధిత తహసిల్దార్ సంతకం చేసే సరిపోతుందని ఆయన అభ్యర్థులకు సూచించారు,



## నియోజకవర్గంలో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం

**మధిర,నవంబర్30( మన వార్త):**మధిర నియోజకవర్గంలో నాలుగు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మధిర మండలం సిద్ధినేనిగూడెం, బోనకల్లు మండలం కలకోట, చింతకాని మండలం రేపల్లెవాడ, రాఘవపురం గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రాఘవపురం గ్రామపంచాయతీ ని సిపిఐ పార్టీ మద్దతుదారులు ఏకగ్రీవం చేసుకోగా, సిద్ధినేని గూడెం కలకోట రేపల్లెవాడ గ్రామపంచాయతీలను అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు దక్కించుకున్నారు. మధిర మండలం సిద్ధినేనిగూడెం గ్రామపంచాయతీ మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ సొంత గ్రామం. ఆ గ్రామపంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. దీంతో సూరంశెట్టి కిషోర్ అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వేల్పుల వెంకట రావమ్మ సర్పంచ్ గా ఏకగ్రీవం అయ్యేందుకు కృషి చేశారు. బోనకల్ మండలం కలకోట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిషోర్ సతీమణి పైడిపల్లి అనిత ఏకగ్రీవంగా అయ్యారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మడుపల్లి భాస్కర్ కోడలు మడుపల్లి అంబిక చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యార






## ఇసుక దోపిడీకి కారకులే బీ ఆర్ ఎస్ నాయకులు...


**–తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పత్తి కృష్ణారెడ్డి...**

**జమ్మికుంట, నవంబర్ 30( మన వార్త ప్రతినిధి):**స్థానిక ఎన్నికలలో ఓడిపోతామనే భయంతో బీ ఆర్ ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పైన అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెసు పార్టీ రాష్ట్ర నాయకుడు మాజీ పీసీసీ కమిటీ సభ్యుడు పత్తి కృష్ణా రెడ్డి ధ్వజమెత్తారు.పట్టణంలోని ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనుగుల, శంభునిపల్లె గ్రామాల్లోని చెక్ డ్యాం కూలడానికి బీ ఆర్ ఎస్ కారణమని నాణ్యత లోపాలతో కట్టడాలు కట్టారని అన్నారు. అదీ కప్పిపుచ్చుకోవడానికి ఇసుక మాఫియా పేల్చేసిందని ఇసుక మాఫియా కు కాంగ్రెసు తో సంబంధం వుందని అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.ఇసుక దందాకు బీ ఆర్ ఎస్ కేరాఫ్ అడ్రస్ అని,ఇసుక లారీలు ఓవర్ లోడ్ తో రవాణా చేయడం వల్ల వావిలాల జమ్మికుంట రోడ్లన్నీ ధ్వంసమయ్యాయని, రైల్వే వంతెన పై పగుళ్లు ఏర్పడి ఇనుప చువ్వలు తేలి ప్రమదకరంగా తయారైందని కాంగ్రెస్ పార్టీ తరపున ధర్నాలు చేస్తే కాంగ్రెసు నాయకులపైన కేసులు పెట్టారని గుర్తుచేశారు.ఇసుక మాఫియా రవాణా అమాయక ప్రజలు చనిపోయారని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజపాలనను చూసి ఓర్వలేక స్థానిక సంస్థల ఎన్నికలో ఓడిపోతామనే భయంతో అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని రైతులకు సాగునీరు, కరెంటు ఉచితంగా అందించాలనే సంకల్పంతో ఉచిత కరెంటు తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని అన్నారు. కాంగ్రెస్ ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు కానీ నేడు కానీ ఇసుక అమ్ముకున్న దాఖలు లేవని గుర్తు చేశారు. దొంగ తనం చేసిన చేసినోడే దొంగా దొంగా అని అరిసినట్టుంది బీ ఆర్ ఎస్ నాయకుల మాటకు అని ఎద్దేవ చేశారు.గతంలో మానేరు వాగు పైన కొండపాక, విలాసాగర్ గ్రామాలలో నిర్మించిన చెక్ డ్యామ్ లు కూలిపోయాయని గుర్తు చేశారు. చెక్ డాం నిర్మాణం లోపం వలన కూలి పోయిందని చెక్ డ్యామ్ లను నాసిరకంగా నిర్మించి ప్రజాధరాన్ని దుర్వినియోగం చేసిన ఎంతటి వారైనా కాంగ్రెస్ పార్టీ సహించబోదని వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,కాంగ్రెసు పార్టీ నాయకులపై అసత్యపు ఆరోపణలు చేస్తే ఉరుగోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రమేష్,శివ కుమార్,రామారావు,రాజేశ్వర రావు,సతీష్ రెడ్డి,రేణుక,స్వప్న,సలీం,సజ్జు, తదితరులు పాల్గొన్నారు.



## హుజురాబాద్‌లో కాళ్ల సంతోష్ ఆధ్వర్యంలో ఘనంగా మహా దివ్య పడిపూజ

**జమ్మికుంట/హుజురాబాద్, నవంబర్ 30( మన వార్త ప్రతినిధి):** హుజురాబాద్ మండలంలోని పరకాల క్రాస్ సమీపం వరంగల్ రోడ్డులో గల వాసవి ఇండస్ట్రీస్ (ఎం.ఆర్.ఎం) ప్రాంగణంలో ఆదివారం మహా దివ్య పడిపూజ, స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ రైస్ మిల్లు వ్యాపారులు కాళ్ళ బసవయ్య కుమారుడు కాళ్ళ సంతోష్, అనిమ దంపతులు స్వంత ఖర్చుతో ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్లూరు వెంకట్రావు, కన్నన్ దురై రాజ్ గురు స్వాముల ఆధ్వర్యంలో పేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సాగిన ఈ పూజ వేడుకల్లో పట్టణం, గ్రామీణ ప్రాంతాల నుంచి అయ్యప్ప మాల ధరించిన సుమారు 500 మంది స్వాములు, 200 మంది నానుస్వాములు పాల్గొన్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆవరణమంతా అయ్యప్ప స్వామి శరణు ఘోషతో మారు మ్రోగింది. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, రైస్ మిల్ వ్యాపారులు, ఆడితి వ్యాపారులు, కిరాణా వర్తక సంఘం నాయకులు, వ్యాపారులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఆరాధించారు. హుజురాబాద్ శివరామకృష్ణ, రామానంద భజన మండలిల ఆధ్వర్యంలో భజన కీర్తనలు నిర్వహించగా ఆ ప్రాంతమంతా భక్తి వాతావరణం నెలకొంది. సంతోష్ కుమార్ పడి అందించగా ఒక్కసారిగా స్వాములు లేచి స్వామియే శరణమయ్యప్ప అంటూ కొలిచారు. అనంతరం భిక్ష, తీర్థప్రసాదాలు అందజేసి పాదాభివందనం చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఈ ఏడాది హుజురాబాద్ పట్టణంలోనే మొట్టమొదటిసారిగా పెద్ద పడిపూజ నిర్వహించినట్లుగా చర్చించుకుంటున్నారు.



## నామినేషన్ల ప్రక్రియ పరిశీలించిన

**–డిఆర్డిఏ జయదేవ్ ఆర్య....**

**బెజ్జంకి, నవంబర్ 30 (మన వార్త)** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దాచారం, బెజ్జంకి క్రాసింగ్ క్లస్టర్లలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పిడి డిఆర్డిఏ జగదేవ్ ఆర్య పరిశీలించి, నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాటు సిబ్బంది విధుల నిర్వహణను సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా చూడాలని అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి ఎంపీడీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.బెజ్జంకి మండలంలో ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని రెండవ విడతలో భాగంగా మొదటి 24 గ్రామపంచాయతీలలో 33 మంది అభ్యర్థులు సర్పంచ్ అభ్యర్థికి నామినేషన్ సాకలి వేశారు.210 వార్డులకు గాను 42 మంది నామినేషన్ వేసారని ఎంపీడీవో కడివెర్గు ప్రవీణ్ తెలిపారు.



## చిన్న శంకరంపేటలో అట్టహాసంగా నామినేషన్ల స్వీకరణ...

**చిన్న శంకరంపేట నవంబర్ 30 ( మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండలంలో 31 గ్రామపంచాయతీలకు గాను సర్పంచ్ కు 28, వార్డు సభ్యులకు 51 మంది నామినేషన్లు వేయడం జరిగిందని ఎన్నికల అధికారి దామోదర్ తెలిపారు, నామినేషన్ల ప్రక్రియ మూడు రోజులు కొనసాగుతుందని ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలలో ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేసి అంద చేయాలని తెలిపారు.



## ఉపాధ్యాయుడు గుడిమిల్ల బలరాం కు నేషనల్ టీచర్ ఇన్స్ప్రెషన్ అవార్డు ప్రదానం...

**జమ్మికుంట, నవంబర్ 30( మన వార్త ప్రతినిధి):**నేషనల్ టీచర్ ఇన్స్ ప్రెషన్ అవార్డును ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుడిమిల్ల బలరాం అందుకున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా హైదరాబాద్ లోని బిర్లామందిర్ కాన్ఫరెన్స్ హాల్లో, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ శారదా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ టీచర్ ఇన్స్ ప్రెషన్ అవార్డు ఉత్సవం నిర్వహించారు.కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు గుడిమిల్ల బలరాం పిల్లలకు సులువుగా అర్థమయ్యే విధంగా తాను తయారుచేసిన తెలుగు దర్శిని తో బోధిస్తూ, ఆట,పాటలతో, కథలతో విద్యార్థులు బడికి రావడానికి ఆసక్తిని పెంచుతూ, పాఠశాలకు వస్తున్న ప్రతి విద్యార్థి పుట్టినరోజున ఆ విద్యార్థి చే బడిలో మొక్కను నాటిస్తూ,వినూతన కార్యక్రమాలు చేపడుతూ పాఠశాలకు పంపిస్తున్న పిల్లల తల్లి దండ్రుల కు ప్రభుత్వబడిపై నమ్మకం కలిగిస్తూ పనిచేస్తున్నందులకు గాను నేషనల్ టీచర్ ఇన్ స్ప్రెషన్ అవార్డు కు ఎంపిక చేసినట్లు శారదా ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పట్నం కమల మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మరియు ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ గుడిమిల్ల బలరాం కు నేషనల్ టీచర్ ఇన్ స్ప్రెషన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డు వచ్చినందుకుచాలా సంతోషం వ్యక్తం చేస్తూ నాపై ఇంకా బాధ్యత పెరిగిందని పిల్లల సామర్థ్యాలు పెంచడానికి కృషి చేస్తానని గుడిమిల్ల బలరాం తెలిపారు.అవార్డు అందుకోవడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




## గిరిజన విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయ శిక్షణ కీలకం: భద్రాచలం ప్రాజెక్టు అధికారి బి రాహుల్

**భద్రాచలం, నవంబర్ 30. ( మన వార్త ప్రతినిధి )**గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు విద్యతో పాటు వివిధ కళలు, విజ్ఞాన అంశాలపై దృష్టి సారించేలా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. ఆదివారం సాయంత్రం భద్రాచలం పట్టణంలోని బీఈడీ కళాశాలలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు, పీడీ, పీఈటీలకు తొమ్మిది రోజులుగా జరిగిన కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా 15 రోజులుగా శిక్షణ పొందిన గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులతో మరియు డీఆర్పీలతో సమగ్ర చర్చలు జరిపారు. ఉపాధ్యాయుల విద్యాసామర్థ్యాలు, బోధనా నైపుణ్యాలు పెంపొందించడంలో ఈ శిక్షణలు కీలకపాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి కనబరచేందుకు, గణిత భయం పోయేలా బోధనలో మార్పులు చేయాలని సూచించారు. సైన్స్ ల్యాబ్‌లు అభివృద్ధి చేసేందుకు అవసరమైన సదుపాయాలు, పాఠ్య సామగ్రిని త్వరలో అందజేస్తామని తెలిపారు. అలాగే సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు ప్రేరణాత్మక బోధన చేస్తే, విద్యార్థులు గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలను దక్కించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. బట్టీ పట్టే విధానం కన్నా విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా శక్తి పెంపొందించే పద్ధతిలో బోధన చేయాలని సూచించారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు అవశ్యకమైన సదుపాయాలను కల్పించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, వారి ఉన్నత భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తానని రాహుల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డా. వీరు నాయక్, ఏసీఎంఓ రమేష్, ఎస్‌సీఆర్పీ మోతిలాల్, డీఆర్పీలు మరియు వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## నామినేషన్ దాఖలు చేసిన ఎన్ఆర్ఐ చంద్రశేఖర్...

**చిన్న శంకరంపేట నవంబర్ 30( మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరంపేట సర్పంచ్ అభ్యర్థిగా ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారులకు అందజేశారు. తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకొని సోమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తన నామినేషన్ పత్రాన్ని అధికారులకు అందజేసేందుకు ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని గ్రామ ప్రజలంతా సహకరించి సర్పంచ్గా గెలిపించాలని ఆయన కోరారు.




## బీసీల ధర్మ యుద్ధభేరీలో పాల్గొన్న జిల్లా బీసీ సంఘం నాయకులు...

**కరీంనగర్,నవంబర్30( మన వార్త ప్రతినిధి):** హైదరాబాదులో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న బీసీల ధర్మ యుద్ధభేరి ధర్నా కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ ,బిసి రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ , బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నా రోజు రాకేష్ చారి , జిల్లా కార్యదర్శి వాయిల రాజకుమార్ , ఆశిష్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి బీసీలను అడ్డుపెట్టుకొని ఓట్లతో గెలిచి రాజకీయంగా ఎదిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 3న హుస్నాబాద్ పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా ఆయనను కరీంనగర్ , పెద్దపల్లి , జగిత్యాల , సిరిసిల్ల జిల్లాల బీసీ సంఘం నేతలు మరియు ప్రధాన రాజకీయ పార్టీలతో అడ్డుకుంటామని అతనిని బహిరంగ సభ కు నిరసన మరియు ప్లా కార్డులతో ప్రదర్శన , రాస్తారోకు నిర్వహిస్తామని తెలిపారు. డిసెంబర్ 2న కరీంనగర్ జిల్లాలోని డిసిసి కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన మరియు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. బీసీలను నమ్మించి మోసం చేసిన ఘనత కూడా కేంద్ర రాష్ట్ర దేనని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 42% రిజర్వేషన్లు గవర్నర్ దగ్గర బిల్లు ఆమోదం పొందేలా చ చూసిన తర్వాత అఖిలపక్ష నేతలతో వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో ఒప్పించి రాష్ట్రపతి బిల్లు ఆమోదం పొందేలా చూడాలని లేని తరుణంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన కేంద్ర మంత్రులు ఎంపీలు రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు రోడ్డుపైన తిరిగబోనివ్వమని హెచ్చరించారు.



## ఇల్లంతకుంట మండలంలో రెండవ విడత నామినేషన్ల ఆదివారం మొదటి రోజు స్పందన...



List of Centres For Receiving Sarpanch and Ward Members Nominations Gram Panchayats of Ellanthakunta Mandal. Dt:30.11.2025

| Sl.no | Nomination Center Cluster | GPs included in the cluster | No.of Nominations filed Sarpanchas today | No. of Wards | No.of Nominations Ward Members filed today | Remarks |
|---|---|---|---|---|---|---|
| 1 | Ellanthakunta | 1. Ellanthakunta | 1 | 12 | 4 | |
| | | 2. Jangamreddypally | | 8 | | |
| 2 | Muskanipet | 1. Muskanipet | 2 | 10 | | |
| | | 2. Gollapalli | | 8 | 1 | |
| | | 3. Venkatraopally | 1 | 8 | | |
| 3 | Thallapally | 1. Thallapally | 2 | 8 | 3 | |
| | | 2. Kesannapally | 1 | 6 | | |
| | | 3. Arepalli | | 8 | | |
| | | 4. Pathikuntapally | 1 | 8 | 6 | |
| 4 | Pothur | 1. Pothur | 3 | 10 | 3 | |
| | | 2. Kandikatkoor | 1 | 10 | 3 | |
| | | 3. Vallampatla | | 10 | 1 | |
| 5 | Vanthadupula | 1. Vanthadupula | 1 | 10 | 2 | |
| | | 2 Rangampet | 2 | 6 | 1 | |
| | | 3 Kistaraopally | 1 | 6 | | |
| 6 | Repaka | 1. Repaka | 2 | 10 | 1 | |
| | | 2. Thallalapalle | | 6 | 2 | |
| | | 3. Somarampet | 1 | 8 | 2 | |
| 7 | Galipally | 1. Galipalli | 1 | 10 | 3 | |
| | | 2. Jawaripet | | 8 | | |
| | | 3. Narsakkapet | 1 | 8 | | |
| 8 | Anantharam | 1. Anantharam | 2 | 10 | 6 | |
| | | 2. Thippapoor | 1 | 8 | | |
| | | 3. Chikkudonipally | 1 | 4 | 1 | |
| 9 | Veljipur | 1. Veljipoor | 4 | 10 | 1 | |
| | | 2. Obulapuram | 1 | 10 | 3 | |
| | | 3. Gudepupally | 1 | 6 | | |
| | | 4. Rahimkhanpet | 2 | 10 | 1 | |
| 10 | Peddalingapoor | 1. Peddalingapoor | 1 | 10 | | |
| | | 2. Dacharam | 1 | 10 | | |
| | | 3. Botimeedipally | 1 | 4 | | |
| | | 4. Ramojipet | 1 | 8 | 2 | |
| 11 | Ananthagiri | 1. Ananthagiri | | 10 | | |
| | | 2. Thenugavaripally | | 8 | | |
| | | 3. Sirikonda | 1 | 8 | | |
| | GRAND TOTAL | | 38 | 294 | 46 | |


**ఇల్లంతకుంట,నవంబర్ 30 (మన వార్త ప్రతినిధి):**ఇల్లంతకుంట మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ల స్వీకరణలు ఆదివారం ప్రారంభం కావడంతో మండలంలో మొత్తం 38 సర్పంచ్ నామినేషన్లు,46 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించబడ్డాయి అని మండల అధికారి,ఎంపీడీవో శశికళ తెలిపారు.నామినేషన్లు ఈనెల 2వ తేదీ సాయంత్రం 5 గంటల వరకే స్వీకరించబడతాయి అని తెలియజేశారు.

## నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్...



**నార్సింగి నవంబర్ 30 ( మన వార్త ప్రతినిధి)** రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేడు ప్రారంభమైంది నార్సింగ్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియలు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు, నామినేషన్ వేసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు, నామినేషన్లు మూడు రోజుల పడుకున్న సాగుతాయని ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు తెలిపారు.

## స్థానిక ఎన్నికల సహాయక కేంద్రాన్ని సందర్శించిన మెదక్ ఆర్డిఓ రమాదేవి...




**నిజాంపేట నవంబర్ 30( మన వార్త ప్రతినిధి)**మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో రెండవ విడత గ్రామపంచాయతీ సర్పంచ్ నామినేషన్ ప్రక్రియ సహాయక కేంద్రాలను ఆదివారం మెదక్ ఆర్డిఓ రమాదేవి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య,లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుత వాతావరణం లో నామినేషన్ ప్రక్రియ కొనసాగేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే అభ్యర్థులు కూడా అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

## మొదటిరోజు ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల ప్రక్రియ...




**నిజాంపేట నవంబర్30( మన వార్త ప్రతినిధి)**నిజాంపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఎంపీడీవో రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు సంబంధించి రెండో విడత మొదటిరోజు నామినేషన్ ప్రక్రియలో సర్పంచ్ అభ్యర్థులు 17 మంది,వార్డు అభ్యర్థులు 29 మంది నామినేషన్ వేశారని తెలిపారు. ఈ నామినేషన్ ప్రక్రియ మరో మంగళవారం వరకు కొనసాగుతుందని తెలిపారు.

## అనంతారం నామినేషన్ల ఆదివారం మొదటి రోజు స్పందన...

**ఇల్లంతకుంట,నవంబర్ 30 (మన వార్త ప్రతినిధి):**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్లు ఆదివారం (30-11-2025) ప్రారంభమయ్యాయి.( ప్రారంభం కావడంతో అనంతారం గ్రామంలో సర్పంచ్ స్థానాలకు రెండు నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 2వ వార్డు 1, 3వ వార్డు 1, 4వ వార్డు 1, 5వ వార్డు 1, 6వ వార్డు 1, 7వ వార్డు 1 నామినేషన్లు దాఖలయ్యాయి.)..చిక్కుడువానిపల్లి గ్రామ పంచాయతీ: సర్పంచ్ స్థానానికి 1 నామినేషన్, 1వ వార్డు 1 నామినేషన్...( తిప్పాపూర్ గ్రామ పంచాయతీ: సర్పంచ్ స్థానానికి 1 నామినేషన్ )..ఇతర వార్డుల స్థానాలకు నామినేషన్లు ఇంకా నమోదు కాలేదు.నామినేషన్లు ఈనెల 2వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించబడతాయని గ్రామ స్పెషల్ అధికారి,మండల ఎంపీడీవో శశికళ,గ్రామపంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

**-ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి...**

**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, నవంబర్ 30, మనవార్త.**కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. చర్లపల్లి డివిజన్ గణేష్ నగర్ (సోనియా గాంధీనగర్ )లో ఆదివారం నూతనంగా ఎన్నికైన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నగర్ కుటుంబాల భాగస్వామ్యంతో కాలనీ అభివృద్ధి పథంలో ముందుకు సాగడం సంతోషంగా ఉందన్నారు. కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. గణేష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి వర్గం సభ్యులు తదితరులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నేమురి మహేష్ గౌడ్, సిసిఎస్ పద్మారెడ్డి, గుమ్మడి జంపాల్ రెడ్డి, కశు వజ్జల విద్యాసాగర్, ఎమ్మెస్ చారి, దాసరి కనకయ్య, ఏనుగు సురేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి కాలనీ వాసులు మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## రెడ్డి సంఘం చెంగిచెర్ల నూతన కమిటీ ఏకగ్రీవం

**మేడిపల్లి ,నవంబర్ 30, మనవార్త :** చెంగిచర్ల రెడ్డి సంఘము నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ముగిసింది. రెడ్డి సంఘం చెంగిచర్ల ఆడక్ కమిటీ మోతే రఘు తిరుపతిరెడ్డి, చిర్ర శ్రీధర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, ఆధ్వర్యంలో నూతన రెడ్డి సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులు బొల్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, కేతిరెడ్డి శశిధర్ రెడ్డి, అధ్యక్షులు బండం వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు Ch.మోహన్ రెడ్డి, R. రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి P.శేఖర్ రెడ్డి, కోశాధికారి C. రఘుపాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ చందర్ గౌడ్, బింగి జంగయ్య యాదవ్, కో ఆప్షన్ మెంబర్ రంగా బ్రహ్మన్న గౌడ్ నూతన కమిటీని శాలువతో సత్కరించినారు. నూతన రెడ్డి సంఘం కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమం రెడ్డి సంఘం చెంగిచెర్ల కమిటీ సభ్యులు, రెడ్డి సంఘం కుటుంబ బంధువులు పాల్గొన్నారు.



## మీకు తెలియకుండా క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు కట్ అయ్యాయా..?




**- వెంటనే ఇలా చేస్తే మీ డబ్బులు సురక్షితం...**


**హైదరాబాద్,** ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా క్రెడిట్ కార్డులను లక్ష్యంగా చేసుకుని మోసగాళ్లు వినూత్న పద్ధతుల్లో డబ్బులను దోచేస్తున్నారు. అకౌంటు నుంచి తెలియకుండానే డబ్బులు తగ్గిపోవడం, అనుమానాస్పద లావాదేవీలు జరగడం తరచూ కనిపిస్తున్న సంఘటనలు. ఇలాంటి సందర్భాల్లో చాలామంది ఏం చేయాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. అయితే వెంటనే తీసుకునే కొన్ని చర్యలు మీ డబ్బులను తిరిగి రాబట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయి.క్రెడిట్ కార్డు నుంచి అనుమతి లేకుండా డబ్బులు విత్‌డ్రా అయ్యాయని గమనించిన వెంటనే ఆ కార్డును తక్షణమే నిలిపివేయాలి. బ్యాంకులు అందించే మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ సేవల ద్వారా ఎప్పుడైనా కార్డును బ్లాక్ చేసే అవకాశం ఉంటుంది. కార్డు బ్లాక్ చేయడం ద్వారా మరిన్ని అనధికార లావాదేవీలు జరగకుండా ఆపవచ్చు.తర్వాత వెంటనే బ్యాంకును సంప్రదించి మోసపూరిత లావాదేవీ గురించి సమాచారం ఇవ్వాలి. ఈ మేరకు బ్యాంకు మీరు వివాద ఫారమ్ నింపాలని సూచిస్తుంది. అందులో లావాదేవీ జరిగిన తేదీ, మీ కార్డు వివరాలు, ఆ చెల్లింపు మీరు చేయలేదన్న నిర్ధారణ వంటి అంశాలు నమోదు చేయాలి. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే బ్యాంకు ప్రాథమిక దర్యాప్తు ప్రారంభిస్తుంది. లావాదేవీ మోసపూరితమేనని తేలితే కస్టమర్లకు సహాయం చేసే ప్రక్రియను చేపడుతుంది.ఒకేసారి అన్ని అధికారిక వేదికలపై కంప్లయింట్ చేయడం కూడా కీలకం. బ్యాంకు కస్టమర్ కేర్, మొబైల్ యాప్, ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థ, సమీప పోలీస్ స్టేషన్, ఆర్‌బీఐ ఫిర్యాదు పోర్టల్ వంటి అన్ని మార్గాల్లో ఫిర్యాదు నమోదు చేస్తే సమస్య పరిష్కారం త్వరగా జరుగుతుంది. మోసానికి సంబంధించిన ప్రతి ఆధారాన్ని ౦ మెసేజ్‌లు, అకౌంట్ స్టేట్‌మెంట్‌లు, లావాదేవీల స్క్రీన్‌షాట్లు, ఎఫ్ఐఆర్ కాపీలు ౦ భద్రపర్చుకోవాలి. ఇవి మీ క్లెయిమ్‌ను బలపరుస్తాయి.ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం కస్టమర్ తప్పు లేకుండా మోసం జరిగిన సందర్భాల్లో డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉంటుంది. అందువల్ల ఇలాంటి మోసాలు గమనించిన వెంటనే ఆలస్యం చేయకుండా పై చర్యలు చేపట్టడం అత్యంత అవసరం.

## ఇండియాలో బాగా అమ్ముడవుతున్న తక్కువ ధర బైకులు ఇవే...




**హైదరాబాద్,** దేశంలో ఇటీవల వాహనాలపై పన్నులు తగ్గించడంతో బైక్ ధరలు భారీగా తగ్గాయి. పెట్రోల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కువ సావింగ్స్ ఇచ్చే బైక్‌లను కొనాలనే ఆసక్తి ప్రజల్లో పెరిగింది. ముఖ్యంగా ఎనభై వేల రూపాయలలోపు వచ్చే వంద సీసీ శ్రేణి బైక్‌లు పెద్దగా ఆదరణ పొందుతున్నాయి. తక్కువ ధరతో పాటు మంచి మైలేజ్ వచ్చే ఈ విభాగంలో ఐదు బైక్‌లు దేశవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడవుతున్నాయి.వంద సీసీ శ్రేణిలో హీరో కంపెనీకి చెందిన స్ప్లెండర్ ప్లస్ దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్‌గా కొనసాగుతోంది. కంపెనీ ప్రత్యేకంగా అందించిన ఇంధన పొదుపు సాంకేతికతతో ఈ వాహనం నగర ప్రయాణాల్లో ఎక్కువగా అనుకూలంగా మారింది. ఇదే కంపెనీకి చెందిన హెచ్ఎఫ్ డీలక్స్ కూడా తక్కువ ధర, ఎక్కువ దూరం ప్రయాణించే లక్షణాలతో కొనుగోలు దారులను ఆకట్టుకుంటోంది. హొండా షైన్ వంద మోడల్ సరళమైన నిర్మాణం, మన్నికైన ఇంజిన్‌తో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మంచి డిమాండ్ సాధించింది. దీర్ఘ దూరాలకు వినియోగించే వాహనాల్లో బజాజ్ ప్లాటినా వంద బలమైన నిలువు సస్పెన్షన్, ఎక్కువ మైలేజ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. హీరో ప్యాషన్ ప్లస్ మాత్రం యువతను లక్ష్యంగా చేసుకొని ఆకర్షణీయమైన రూపకల్పన, ఫీచర్లు, మంచి సౌకర్యాలు కలిగిన బైక్‌గా నిలుస్తోంది. ఈ ఐదు బైక్‌లు తక్కువ నిర్వహణ ఖర్చులు, మన్నికైన ఇంజిన్‌లు మరియు ఇంధన సామర్థ్యంతో మధ్యతరగతి ప్రజల మొదటి ఎంపికగా మారి, అమ్మకాల పట్టికలో అగ్రస్థానాల్లో నిలుస్తున్నాయి.

# రూ.25 లక్షలు జీవన్ఆనంద్ అద్భుత ప్రయోజనాలు




**హైదరాబాద్ :**పొదుపు చేయాలని భావించే సాధారణ కుటుంబాలకు భరోసా పేరుగా నిలిచింది జీవన బీమా రంగంలోని ప్రభుత్వ సంస్థ ఎల్ఐసీ. దీర్ఘకాలిక సేవింగ్స్‌తో పాటు ప్రమాద రక్షణను ఒకే సారి అందించే పథకాలను ఎల్ఐసీ ప్రస్తుతం అనేకం అమలు చేస్తోంది. వాటిలో విశేష ప్రాచుర్యం సంపాదించిన పథకం జీవన్ఆనంద్. తక్కువ మొత్తంతో ప్రారంభించి, అద్భుత లాభాలు అందించడం ఈ పాలసీకి పెద్ద ఆకర్షణగా మారింది. ఈ పథకంలో చేరిన కస్టమర్లు నెల నెలా చెల్లించే చిన్న మొత్తమే కాలక్రమంలో భారీ రాబడిగా మారుతుంది. రోజుకు కేవలం నలభై ఐదు రూపాయలు పొదుపు చేస్తేనే పాలసీ కాలపరిమితి పూర్తయ్యే సమయానికి మొత్తం ఇరవై ఐదు లక్షల వరకు లాభం దక్కుతుందనే లెక్కలు అధికారికంగా బయటకు వచ్చాయి. నెలకు వెయ్యి మూడువందల యాభై ఎనిమిది రూపాయలు చెల్లింపుగా ఇచ్చితే ముప్పై ఐదు సంవత్సరాల కాలంలో ఐదు లక్షలకు పైగా ప్రీమియంలు చేరుతాయి. ఇవి మోచ్యూరిటీ సమయంలో ప్రాథమిక మొత్తంతో పాటు తిరిగి వచ్చేవికే పరిమితం కాకుండా, ప్రత్యేక పథకాల ద్వారా అందించే పునఃపరిశీలన బోనస్, తుది బోనస్‌లు కలిసి మొత్తం ఇరవై ఐదు లక్షలకు చేరుకుంటాయి. పాలసీ కాలంలో పాలసీదారునికి ఏదైనా అపమరణ లేదా ప్రమాదం సంభవిస్తే నామినీకి శాతం వంద ఇరవై ఐదు రక్షణ మొత్తాన్ని ఎల్ఐసీ అందిస్తుంది. దీర్ఘకాలిక సేవింగ్స్‌తో పాటు బీమా రక్షణను ఒకే చోట అందిస్తుండటం జీవన్ఆనంద్‌కు ప్రత్యేకతను తీసుకొచ్చింది. బాలల నుండి వృద్ధుల వరకు ఈ పాలసీలో చేరవచ్చు. పథకం పట్ల సామాన్య కుటుంబాల్లో పెరుగుతున్న విశ్వాసం దృష్ట్యా జీవన్ఆనంద్ సేవింగ్స్ పథకంగా దేశ వ్యాప్తంగా వేగంగా ప్రాధాన్యం పొందుతోంది.


# డిసెంబర్ 1 బ్యాంకు సెలవు



**– ఎందువల్లే అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ బ్యాంకులు మూసివుంటాయి...**

**హైదరాబాద్, 30 నవంబర్ 2025 డిజైనర్ టెక్ గురు ప్రతినిధి:**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన క్యాలెండర్ ప్రకారం ఈ నెలపట్టికలో కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక కారణాల వల్ల బ్యాంకు శాఖలు ఒకరోజు సెలవు నిర్వహించనున్నాయి. ప్రత్యేకంగా డిసెంబర్ 1న అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ ప్రాంతాల్లో రాష్ట్ర స్థాపన మరియు స్థానిక దినోత్సవాల కారణంగా బ్యాంకు శాఖలు మూసివుండనున్నట్లు అధికారులు వెల్లడించారు. అందువల్ల ఆ రెండు రాష్ట్రాల బసినవాసులు ఆ రోజు బ్రాంచ్ వేదికగా చేసే ఏవైనా పనులను ముందుగా ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో సాధారణంగా బ్యాంకులు యథావిధిగా తెరిచి ఉంటాయి కాగా, బ్యాంకు సెలవు ఉన్నప్పటికీ ఇంటర్నెట్ ద్వారా అన్ని ప్రధాన బ్యాంకింగ్ సేవలు పనిచేస్తాయని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, నగదు లావాదేవీలు, ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపు, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవలు బ్యాంకు శాఖలు మూసిన రోజుల్లో కూడ అందుబాటులో ఉంటాయి. అయితే శాఖను ప్రత్యక్షంగా సందర్శించాల్సిన ఇతర సేవల కోసం సందర్శకులకు ముందస్తుగా సమాచారం పొంది వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. రెజర్వ్ బ్యాంకు ఇచ్చిన కాలెండర్ ప్రకారం డిసెంబర్ నెలలో వివిధ కారణాల వల్ల మొత్తం కొన్ని రోజుల పాటు బ్యాంకు శాఖలు సెలవు ఉంటాయని, ఆ రోజుల వివరాల కోసం రిజర్వ్ బ్యాంకు అధికారిక జాబితాను చూడాలనీ, అవసరమైతే మీ బ్యాంకు బ్రాంచ్‌ను సంప్రదించి నిర్ధారించుకోవాలి అని కూడా తెలిపారు.

# అమెరికా మార్కెట్లో భారత్ ఎగుమతులకు భారీ దెబ్బ



**న్యూఢిల్లీ,** అధిక సుంకాల ప్రభావంతో అమెరికాకు భారత ఎగుమతులు భారీగా క్షీణించినట్లు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ సంస్థ వెల్లడించింది. ఈ ఏడాది మే నుంచి అక్టోబర్ మధ్య కాలంలో అమెరికా మార్కెట్లో భారత ఎగుమతులు వరుసగా తగ్గుతూ వచ్చి, ఐదు నెలల్లో దాదాపు 28.5 శాతం మేర పతనమయ్యాయి. మే నెలలో 8.83 బిలియన్ డాలర్ల విలువ చేసిన ఎగుమతులు అక్టోబర్ నాటికి 6.31 బిలియన్ డాలర్లకే చేరిపోయాయి. ఈ భారీ క్షీణతతో భారత ఎగుమతి రంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ రెండో తేదీన భారత ఉత్పత్తులపై పది శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత దశలవారీగా ఈ పన్నులను పెంచుతూ ఆగస్టు చివరి నాటికి 50 శాతం వరకూ పెంచారు. సుంకాల పెంపు వల్ల అమెరికా దిగుమతిదారులు భారత ఉత్పత్తుల కొనుగోలు తగ్గించడంతో దేశీయ ఎగుమతిదారులకు భారీ దెబ్బ తగిలింది. ఇదే సమయంలో చైనా, జపాన్ వంటి ఇతర దేశాలపైనా అమెరికా భారీ సుంకాలు విధించడంతో అంతర్జాతీయ వాణిజ్య వాతావరణం ఒత్తిడికి గురైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రొయ్యలు, ఆభరణాలు, రత్నాలు, ఆటో భాగాలు, విద్యుత్ యంత్రాలు వంటి ప్రధాన ఎగుమతి విభాగాలు తమ మార్కెట్లను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు సంస్థలు అమెరికా మార్కెట్ నుంచి డిమాండ్ తగ్గిపోవడంతో తమ ఉత్పత్తులను ఆసియా, యూరప్ దేశాలకు మళ్లించాయి. ముఖ్యంగా ఆభరణాల రంగం తీవ్రంగా ప్రభావితమై, సెప్టెంబర్ నెలలో గత ఏడాదితో పోలిస్తే అమెరికాకు ఎగుమతులు 76 శాతం వరకు క్షీణించాయి. అయితే ప్రత్యామ్నాయ మార్కెట్లు అన్వేషించడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు ఎగుమతులు 79 శాతం, హాంకాంగ్‌కు 11 శాతం, బెల్జియంకు 8 శాతం పెరిగాయి. అందువల్ల మొత్తం రత్నాలు, ఆభరణాల ఎగుమతులు పెద్దగా పడిపోకుండా 1.5 శాతం మేర మాత్రమే తగ్గాయి. అయితే పత్తి దుస్తులు, తోలు పాదరక్షలు, క్రీడా సామగ్రి, కార్పెట్‌లు వంటి రంగాలకు మాత్రం తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విభాగాల్లో ఆసియా దేశాల మధ్య పోటీ పెరగడం కూడా భారత ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో పెరుగుతున్న అనిశ్చితి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సుంకాల అంశంపై అమెరికాతో చర్చలు చేపట్టనుందని వాణిజ్య వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# వారం రోజుల్లో వెండి రూ.24 వేలు ఎగిసిన ధర




**హైదరాబాద్,** దేశీయ మార్కెట్‌లో పసిడి వెండి ధరలు మళ్లీ ఎగిసిపడుతున్నాయి. నవంబరు చివరి వారంలో వెండి ధర రికార్డు స్థాయిలో పెరిగి ఇన్వెస్టర్లు, ఆభరణాల కొనుగోలుదారులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. అదే సమయంలో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో పసిడి డిమాండ్ పెరగడం ధరలను మరింత పైకెత్తింది. నవంబరు 21న 24 క్యారెట్ల స్వచ్ఛమైన పసిడి ధర రూ. 1,23,146 ఉండగా, 28న అది రూ. 1,26,591కి చేరుకుంది. అంటే కొన్ని రోజుల్లోనే దాదాపు రూ. 3,445 పెరిగినట్టైంది. నవంబరు 30 నాటికి తులం ధర రూ. 1,29,820 వద్ద నిలవడంతో మొత్తం ఒక వారంలోనే రూ. 6 వేలకుపైగా ఎగిసినట్టు స్పష్టమైంది. దేశవ్యాప్తంగా ప్రకటించే రేట్లు ఒకే విధంగా ఉన్నప్పటికీ, వీటిలో తయారీ చార్జీలు, జీఎస్టీ ఉండవు. ఆభరణాలు కొనుగోలు చేసే సమయంలో 3 శాతం జీఎస్టీతో పాటు తయారీ చార్జీలు అదనంగా చెల్లించాల్సిందే. పసిడి సరసన వెండి ధరల పెరుగుదల మరింత తీవ్రమైంది. నవంబరు 21న కిలో వెండి ధర రూ. 1,61,000 ఉండగా, 28న రూ. 1,76,000కి చేరింది. నవంబరు 30 నాటికి అది నేరుగా రూ. 1,85,000 దాటింది. అంటే కేవలం ఒక్క వారంలోనే రూ. 24 వేల వరకు పెరిగి రికార్డు స్థాయికి చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు పటిష్టం కావడం, అలాగే దేశంలో ముహూర్తాల సీజన్ మొదలవడంతో బంగారం వెండి కొనుగోలు పెరగడం ధరల పెరుగుదలకు ముఖ్య కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్థిక అనిశ్చితి పెరిగిన సమయంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆశ్రయం కోసం పసిడి వైపు మొగ్గుచూపడంతో ధరలు మరింత బలంగా నిలుస్తున్నాయని నిపుణుల అభిప్రాయం.

## నేషనల్ టీచర్ ఇన్స్ ప్రెషన్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు గుడిమిల్ల బలరాం



అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఈరోజు హైదరాబాద్ లోని బిర్లామందిర్ కాన్ఫరెన్స్ హాల్లో, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ శారదా ఎడ్యుకేషన్ సోసైటీ ఆధ్వర్యం లో నేషనల్ టీచర్ ఇన్స్ ప్రెషన్ అవార్డు ఉత్సవం జరిగింది.కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేయుచున్న సీనియర్ ఉపాధ్యాయుడు గుడిమిల్ల బలరాం పిల్లలకు సులువుగా అర్థమయ్యే విధంగా తాను తయారుచేసిన తెలుగు దర్శిని తో బోధిస్తూ, ఆట,పాటలతో, కథలతో విద్యార్థులు బడికి రావడానికి ఆసక్తిని పెంచుతూ, పాఠశాలకు వస్తున్న ప్రతి విద్యార్థి పుట్టినరోజున ఆ విద్యార్థి చే బడిలో మొక్కను నటిస్తూ,వినూతన కార్యక్రమాలు చేపడుతూ పాఠశాలకు పంపిస్తున్న పిల్లల తల్లి దండ్రుల కు ప్రభుత్వబడిపై నమ్మకం కలిగిస్తూ పనిచేస్తున్నందులకు నేషనల్ టీచర్ ఇన్ స్ప్రేషన్ అవార్డు కు ఎంపిక చేసినట్లు శారదా ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పట్నం కమల మనోహర్ తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మరియు ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ గుడిమిల్ల బలరాం కు నేషనల్ టీచర్ ఇన్ స్ప్రేషన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డు వచ్చినందుకుచాలా సంతోషం వ్యక్తం చేస్తూ నాపై ఇంకా బాధ్యత పెరిగిందని పిల్లల సమర్థ్యాలు పెంచడానికి కృషి చేస్తానని గుడిమిల్ల బలరాం తెలిపారు.

## ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన ఆండ్రీ రస్సెల్ ఇక కొత్త అవతారంలో

## కేకేఆర్‌తోనే కొనసాగుతున్న స్టార్ ఆల్‌రౌండర్..!



**హైదరాబాద్,** పన్నెండేళ్ల పాటు ఐపీఎల్‌ను ఊపేసిన కరీబియన్ దుమ్ము రేపే ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఇక ఈ టోర్నీకి వీడ్కోలు పలికాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టును టైటిల్ దిశగా నడిపించిన కీలక ఆటగాళ్లలో రస్సెల్ ఒకడు. 2014లో కేకేఆర్‌లో అడుగుపెట్టిన రస్సెల్ తన ధాటికి జట్టును ఎన్నోసార్లు నిలబెట్టాడు. అయితే 2026 మినీ వేలం ముందు రస్సెల్‌ను ఫ్రాంచైజీ విడుదల చేయడం పెద్ద చర్చ అయ్యింది. వేలంలో అతనికి భారీ డిమాండ్ ఉంటుందని అందరూ అనుకొన్న తరుణంలో రస్సెల్ తీసుకున్న నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.రస్సెల్ అధికారికంగా ఐపీఎల్ నుంచి రిటైర్ అవుతున్నట్టు ప్రకటించాడు. ఈ టోర్నీ తనకు ఏమాత్రం మరవలేని జ్ఞాపకాలని, కోల్‌కతా అభిమానుల ప్రేమ జీవితాంతం గుర్తుండిపోతుందని భావోద్వేగంతో చెప్పుకొచ్చాడు. అయితే కేకేఆర్‌ను పూర్తిగా వదిలి వెళ్లడం లేదని స్పష్టం చేశాడు. ఇకపై ఆటగాడిగా కాకుండా కేకేఆర్ సపోర్ట్ స్టాఫ్‌లో 'పవర్ కోచ్'గా కొత్తగా ప్రస్థానం ప్రారంభించబోతున్నట్టు ప్రకటించాడు.త్వరలో అబుదాబిలో జరగనున్న మినీ వేలం నేపథ్యంలో రస్సెల్ నిర్ణయం మరింత చర్చనీయాంశంగా మారింది. 37 ఏళ్ల వయస్సులో కూడా భారీ షాట్లు, వేగం, ఫిట్‌నెస్‌తో కేకేఆర్‌కు ప్రధాన బలం అయిన రస్సెల్ కెరీర్‌లో 140 మ్యాచ్‌ల్లో 174 స్ట్రైక్‌రేట్‌తో 2,600కు పైగా పరుగులు, 123 వికెట్లు తీసి అద్భుత రికార్డును సొంతం చేసుకున్నాడు.గతకొన్ని సీజన్‌లలో ప్రదర్శన పడిపోవడంతో ఫ్రాంచైజీ అతన్ని విడుదల చేసినా అభిమానుల్లో అతడి క్రేజ్ మాత్రం చుక్కలు తాకినట్టే ఉంది. 2014, 2024 టైటిల్స్‌లో రస్సెల్ కీలక పాత్ర పోషించడం ఇప్పటికీ కేకేఆర్ అభిమానుల మదిలో సజీవంగా ఉంది.ఇక రస్సెల్ నిర్ణయంతో కేకేఆర్ డ్రెస్సింగ్‌రూమ్‌లో కొత్త ఎనర్జీ రానుందని, అతని అనుభవం యువ ఆటగాళ్లకు పెద్ద బలం అవుతుందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. తన ఆటతో ఆకట్టుకున్న ఈ జమైకన్ గాలి ఇప్పుడు తన శక్తి, అనుభవాన్ని కోచింగ్‌లోనూ రుజువు చేయబోతున్నాడు

## వన్డేల్లో విరాట్ కోహ్లీ సంచలన రికార్డు...






రాంచీ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న వన్డే మ్యాచ్‌లో టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ అదరగొట్టారు. చాలా రోజుల తర్వాత సెంచరీతో చెలరేగారు.102 బంతుల్లో 103 పరుగులు చేశారు. దీంతో వన్డేల్లో 52వ సెంచరీని నమోదు చేశారు. మరోవైపు ఈ మ్యాచ్‌లో టీమిండియా దిగ్గజం రోహిత్ శర్మ కూడా రఫ్ఫాడించారు. హాఫ్ సెంచరీ చేశారు.ప్రస్తుతం 40 ఓవర్లు ముగియగా.. నాలుగు వికెట్లు కోల్పోయిన భారత్.. 260కి పైగా పరుగులు చేసింది. ఇదిలా ఉంటే.. తాజా సెంచరీతో విరాట్ వన్డేల్లో 52 సెంచరీలు పూర్తిచేశారు.మార్కో జాన్సెన్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టి 102 బంతుల్లో మూడు అంకెల స్కోరు అందుకున్నాడు. వన్డేల్లో కోహ్లీకి ఇది 52వ శతకం కావడం విశేషం.ఈ క్రమంలో కోహ్లీ టీమ్ఇండియా దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమించాడు. ఓ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా కోహ్లీ చరిత్ర సృష్టించాడు. సచిన్ టెండూల్కర్ తన టెస్టు కెరీర్‌లో 200 మ్యాచ్‌లు ఆడాడు. 53.8 సగటుతో 15921 పరుగులు సాధించాడు. ఇందులో 51 సెంచరీలు, 68 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో

# భారత్ ఘన విజయం



రాంచీలో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో భారత్ ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేసింది. విరాట్ కోహ్లీ అద్భుతమైన సెంచరీతో భారత్ భారీ స్కోరు సాధించినప్పటికీ, దక్షిణాఫ్రికా పోరాడి భారత్‌ను భయపెట్టింది.కానీ చివరకు టీమిండియా 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (18) త్వరగా అవుటైనా, మరో ఓపెనర్ రోహిత్ శర్మ (57 బంతుల్లో 51) రాణించాడు. అయితే, భారత ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచింది విరాట్ కోహ్లీ (120 బంతుల్లో 135, 17 ఫోర్లు, 3 సిక్సర్లు) క్లాసిక్ ఇన్నింగ్స్. దీనితో విరాట్ కోహ్లీ వన్డేల్లో తన 52వ సెంచరీని నమోదు చేశాడు. మధ్యలో రుతురాజ్ గైక్వాడ్ (8), వాషింగ్టన్ సుందర్ (13) విఫలమైనా, కెప్టెన్ కేఎల్ రాహుల్ (56 బంతుల్లో 60, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) కోహ్లీకి చక్కటి సహకారం అందించాడు. చివర్లో రవీంద్ర జడేజా (20 బంతుల్లో 32, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులు మెరిపించడంతో భారత్ 349 పరుగుల భారీ స్కోరును అందుకుంది. ఇక దక్షిణాఫ్రికా బౌలర్లలో నండ్రే బర్గర్, మార్కో జాన్సెన్, కార్బిన్ బాష్, ఓట్నీల్ బాట్మాన్ తలో 2 వికెట్లు పడగొట్టారు.350 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే భారీ ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 7 పరుగులకే రయాన్ రికెల్టన్ (0), క్వింటన్ డి కాక్ (0), ఆ తర్వాత ఐడెన్ మార్క్రామ్ (11) వికెట్లను కోల్పోయింది. ఒక దశలో 77 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే టోనీ డి జోర్జి (39), డెవాల్డ్ బ్రెవిస్ (37) కొంతవరకు ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఆ తర్వాత ఆల్‌రౌండర్లు మార్కో జాన్సెన్ (70 బంతుల్లో 39, 5 ఫోర్లు, 6 సిక్సర్లు),%% కార్బిన్ బాష్ (67 బంతుల్లో 51) దూకుడుగా ఆడి టీమిండియా అభిమానుల్లో ఆందోళన కలిగించారు. ఈ ఇద్దరూ కలిసి మెరుపు ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లారు. అయితే మిగిలిన బ్యాటర్లు విఫలమవడంతో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 332 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇక భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3 వికెట్లతో అద్భుతంగా రాణించగా, సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 4 నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత్‌కు విజయాన్ని అందించాడు. చివర్లో అర్షదీప్ సింగ్ 2 రెండు వికెట్లు తీసి దక్షిణాఫ్రికా పతనాన్ని పూర్తి చేశాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో, మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.


## శివ రీ-రిలీజ్ మిస్ అయ్యారా?



**– ఓటీటీలోకి రాబోతున్న కొత్త అప్‌డేట్...**

**హైదరాబాద్,**మూడు దశాబ్దాలకు పైగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరిగిపోని ముద్ర వేసిన కల్ట్ క్లాసిక్ శివ మరోసారి రజత తెరను తాకి ప్రేక్షకులను ఉర్రూతలూగించిన విషయం తెలిసిందే. నాగార్జున రంగోపాల్ వర్మల కలయికలో వచ్చిన ఈ చిత్రం నవంబర్ 14న నూతనంగా 4కే రూపంలో రీ-రిలీజ్ అవగా, పాత జ్ఞాపకాల అలలతో ప్రేక్షకులు థియేటర్లకు వెల్లువలా చేరుకున్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత తెరపైకి వచ్చినా, శివకు ఉన్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని విడుదలైన ప్రతి కేంద్రంలో ఏర్పడిన సంబరాలు మరోసారి రుజువయ్యాయి.తాజాగా థియేటర్లలో ఈ రీ-రిలీజ్‌ను చూసే అవకాశం కోల్పోయిన వారికి ఎంతో ఆనందం కలిగించే సమాచారం బయటకు వచ్చింది. అంతర్జాతీయ చలన చిత్రోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జున, శివ 4కే వెర్షన్‌ను త్వరలో ఓటీటీ ద్వారా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు జరుగుతున్నాయని స్పష్టంగా తెలిపారు. దీంతో, ఈ చిత్రాన్ని మళ్లీ పెద్ద తెరపై ఆస్వాదించలేకపోయిన సినిమా ప్రేమికుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఓటీటీలో ఏ వేదికలో, ఎప్పుడు ప్రసారం కానుందన్న వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం.శివ చిత్రంలోని సంగీతం, నేపథ్య స్వరాలు, మాస్ సన్నివేశాలు, కాలేజ్ వాతావరణం, విద్యార్థి ఉద్యమాల ప్రతిబింబయి ఇవన్నీ దర్శకుడు వర్మ ప్రత్యేక శైలిలో మలిచిన తీరు ఇప్పటికీ ప్రేక్షకులకు హుషారునిస్తుంది. అమల నటన, రఘువరన్ విలనిజం, నాగార్జున ఒరవడి కలిసి ఆ కాలంలోనే కాకుండా ఇప్పటికీ యూనివర్సల్ కలిగించే చిత్రంగా నిలిచాయి.అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం, సంగీత మాంత్రికుడు ఇళయరాజా అందించిన స్వరాలతో మరింత సజీవం అయింది. ఓటీటీ విడుదల తర్వాత యువతరం కొత్తగా ఈ సినిమాను అనుభవించబోతోందన్న ఆశాభావం సినీ వర్గాల్లో కనిపిస్తోంది. కాలాన్ని దాటి కూడా అదే ఉత్సాహంతో పలకరించే శివ ఓటీటీ రంగంలో మరోసారి సంచలనం సృష్టించనుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

## అఖండ 2 సెన్సార్ పూర్తయ్యింది




**–డిసెంబరు 5న భారీ విడుదల...**

**హైదరాబాద్,**నందమూరి బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ చలనచిత్రం అఖండ 2 పై అభిమానుల్లో అపారమైన ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ మండలి ఈ సినిమాకు యు/ఏ ప్రతిపత్తిని జారీ చేసింది. బాలయ్య సొంత శైలికి తగ్గట్టుగా రూపొందిన ఘర్షణ దృశ్యాలు, మాస్ భావోద్వేగాలు, శక్తివంతమైన సంభాషణలు ఈ నిర్ణయానికి కారణమయ్యాయని తెలుస్తోంది.తొలి భాగం సాధించిన విశేష విజయానంతరం రెండో భాగంపై అంచనాలు మరింత పెరిగాయి. ఈసారి బాలకృష్ణ ద్విపాత్రాభినయం ప్రేక్షకులను మరింత ఉత్సాహపరచనుంది. పూజా పాత్రలు, ఆలయ వాతావరణం, ఆధ్యాత్మిక మౌలికతుఈ అంశాలతో కలిపి బోయపాటి శ్రీను ఈ చిత్రాన్ని మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దినట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బాలయ్య శైలిలోని ధైర్యం, దూకుడు, వేగం ఈ చిత్రాన్ని సరికొత్త స్థాయికి తీసుకెళ్లబోతున్నాయని అభిమానులు అంటున్నారు.పరిశ్రమలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా డిసెంబరు 5న భారీగా విడుదల కానుంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ప్రదర్శనలు, ఉదయం షోలకు భారీ డిమాండ్ ఉండనుందని అంచనా. సంగీతం, నేపథ్య స్వరాలు, యాక్షన్ బ్లాక్స్ all సహజమైన తెలుగు మాట, పౌరాణిక శైలి, బోయపాటి ప్రత్యేక టచ్‌తో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేయనున్నాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.అఖండ మొదటి భాగం మాదిరిగానే, ఈ చిత్రంలో కూడా న్యాయం కోసం నిలబడే శక్తిమంతమైన పాత్రలో బాలయ్య కనిపించనున్నాడు. ఆధ్యాత్మికత, ధర్మసంకల్పం, శౌర్యంఈ మూడు స్తంభాల మీద కథ నడవనుందని సమాచారం. ప్రేక్షకులు ఎదురుచూస్తున్న మాస్ సంభవానికి రంగం సిద్ధమైపోయింది.

## రష్మిక 'ది గర్ల్ ఫ్రెండ్' త్వరలో ఇంటివద్దే వీక్షణం




**హైదరాబాద్,** సినిమా ప్రదర్శనలో భారీ విజయాన్ని నమోదు చేసిన రష్మిక ప్రధాన పాత్రలో రూపొందిన భావోద్వేగ యాక్షన్ కథనం 'ద గర్ల్ ఫ్రెండ్' ఇప్పుడు ఇంటివద్దే చూడదగ్గ అవకాశంగా మారింది. థియేటర్లలో ప్రేక్షకుల హృదయాలను కదిలించిన ఈ చిత్రం త్వరలోనే డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా అందుబాటులోకి రానుంది. ఈ చిత్రంలో ఒక యువతి జీవితంలో చోటుచేసుకునే ప్రేమ, అనుమానం, స్వేచ్ఛ కోసం చేసే పోరాటం ఎంత తీవ్రంగా ఉంటుందో చూపించే తీరు ప్రేక్షకులను లోలోపల ఆలోచింపజేసింది. నగర జీవనం, చదువుల మధ్య నడిచే యువజన భావోద్వేగాలను మమేకం చేసే ఈ కథ అందరినీ ఆకట్టుకుంది. విద్యాభ్యాసం కోసం నగరానికి వచ్చిన యువతి ఎదుర్కొన్న మానసిక ఒత్తిళు ్లు, సంబంధాల స్వరూపం, స్వాతంత్ర్యం కోసం చేసే ప్రయత్నాలు చాలా ప్రాముఖ్యంగా చూపించారు. అకస్మాత్తుగా తానే ఇష్టపడిన వ్యక్తి స్వభావంలో మార్పులు గమనించిన ఆమె ఆలోచనా ధోరణి ఎలా మారింది, తన జీవితంపై తాను తీసుకున్న నిర్ణయం ఏవిదంగా ముందుకు నడిపిందన్న అంశాలపై కథ సాగుతుంది. ప్రేమలో ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛ ఎంత ముఖ్యమో ఈ చిత్రం ద్వారా రచయిత-దర్శకుడు చూపారు. త్వరలోనే ప్రేక్షకులు ఇంటికే ఈ అనుభూతిని చేరదీసుకునే అవకాశం పొందనున్నారు.

## 'ది రాజా సాబ్' పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యం ప్రభాస్ అభిమానుల్లో ఆందోళన!



**హైదరాబాద్,** పాన్ భారత నటుడు ప్రభాస్ నటిస్తున్న రూపొందింపు భారీ చిత్రాల జాబితాలో మరో ప్రముఖ చిత్రం 'ది రాజా సాబ్'. రొమాన్స్, భయం, వినోదం కలిసిన ప్రత్యేక శైలిలో దర్శకుడు మారుతి రూపొందిస్తున్న ఈ చిత్రం తొలి ప్రకటన నుంచే సినీ వర్గాల్లో విశేష ఆసక్తిని రేకెత్తించింది. ప్రభాస్ సంపూర్ణంగా భిన్నమైన రూపంలో కనిపిస్తున్నాడన్న సమాచారం మరోసారి అభిమానుల్లో భారీ అంచనాలను పెంచింది. ఈ చిత్రాన్ని తొలుత డిసెంబర్ 5న విడుదల చేయాలనే నిర్ణయం ప్రకటించినప్పటికీ, తరువాత సంక్రాంతి సందర్భంగా జనవరి 9కి మార్చినట్లు బృందం తెలిపింది. కానీ, తాజాగా ఈ తేదీపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విడుదలకు కీలకమైన ధారావాహిక ఒప్పందాలు, ప్రసార హక్కులు, ఉపగ్రహ హక్కుల విషయంలో ఇంకా అంతిమ నిర్ణయం వెలువడలేదన్న మాటలు పరిశ్రమలో వినిపిస్తున్నాయి. ప్రభాస్ సినిమాలపై సాధారణంగా అమితమైన ఆసక్తి నిలిచే తరుణంలో ఈ పరిస్థితి ఆశ్చర్యం కలిగించే అంశంగానే మారింది. ఈ చిత్రంలో భారీ స్థాయిలో గ్రాఫిక్స్ పనులు అవసరమైన నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కావలసిన వేగంతో సాగలేదని సమాచారం. ఈ కారణంగా విడుదల తేదీపై ప్రభావం పడినట్లుగా తెలుస్తోంది. తాజాగా విడుదలైన తొలి గీతం మంచి స్పందన తెచ్చుకున్నప్పటికీ, సినిమా మొత్తానికి కోరుకున్న స్థాయి ఉత్సాహం, చర్చ మాత్రం రాలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇవన్నీ కలిసి 'ది రాజా సాబ్' నిజంగా సంక్రాంతికే ప్రేక్షకుల ముందుకు వస్తుందా? లేదా ఆలస్యమవుతుందా? అనే సందేహాలు ప్రభాస్ అభిమానుల్లో కనిపిస్తున్నాయి. బృందం అధికారిక ప్రకటన కోసం అందరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com